కొడుకా! నువ్వొచెడిపో!

వద్దమన్నాటి కుటుంబరావు

ఆ రోజు హనుమాయమ్మగారి ఆనందానికి అవధుల్లేవు. ఎందుకంటే. .ఆవిడ ఒక్కగా నొక్క కొడుకు .... ఆరేళ్ళ తరువాత అమెరికా నుంచి వస్తున్నాడు.

అబ్బాయి ఎం బి. బి. ఎస్ పూర్తి చెయ్యగానే... పెళ్ళి కుదరటం.... పెళ్ళి కాగానే పిల్ల మేనమామ – నవ దంపతుల నిద్దరినీ అమెరికా తీసుకెళ్ళి పోవటం ... అంతా కలలో జరిగినట్టుగా ఉందామెకి. ఆ తరువాత ఇదేరావటం! అందుకని .. ఆమె పడే హడావుడి అంతా ఇంతా కాదు.

ఇంటికి సున్నం కొట్టించింది. ఇళ్ళు వాకిళ్ళు పేడతో అలికించి చక్కగా ముగ్గులు పెట్టించింది. అరిసెలు జంతికలు చేయించింది. కొత్తగా టమోటో.... వంకాయ.... ములక్కాయ ఊరగాయలు పెట్టించింది. ఆవకాయ మాగాయలు ఎటు తిరిగీ ఉండనే ఉన్నయ్!

కొడుకు కోడలుకు ప్రత్యేకంగా ఒక గది కేటాయించింది. ఆరేళ్ళయినా ఇంకా కోడలు కడుపు పండలేదు వాళ్ళకో నలుసు పుట్టి ఉంటే.. తనకింకా ఎంత ఆనందంగా ఉండేదో? బాబునో... పాపనో... ఇక్కడే పెంచుతుండేది తను.... అనుకుంది హనుమాయమ్మ.

ఆమె ఇంత హళ్ళూ పెళ్ళూ చేస్తున్నా.... ఆమె భర్త శ్రీమాన్ సీతయ్య గారి కిదేమీ పట్టినట్టు లేదు.

ఆయన పానాసక్తుడు! ఇంటి విషయాల్లో పూర్తిగా అనాసక్తుడు!

ఆయనకి మందు గ్లాసు ముందుంటే.... మహదానందంగా ఉంటాడు. ఆనందో బ్రహ్మ! అంటుంటాడు.

పదెకరాల పొలం పనులు మొత్తం .... పాలేళ్ళ సాయంతో హనుమాయమ్మ గారు చూసుకోవాల్సిందే! మందొకటే ఉంటే..... హనుమాయమ్మ గారి కింత చింత ఉండేది కాదేమో? దానికి తోడు ఆడపా దడపా పరాయి పడతుల జోడు కూడా కావాలి సీతయ్యకి. డబ్బు వెదజల్లి .... పాలేళ్ళ పెళ్ళాలలో ఆ బలహీనత కలవాళ్ళని వలవేసి పట్టి.... పక్కో కూర్చో పెట్టు కుంటాడు. కూలీకి వచ్చిన వాళ్ళలో.... జాలీగా ఉండేదాన్ని ఎన్నుకుని.... డబ్బుతో కొనుక్కుంటాడు. లేదా.... ఆర్థిక అవసరాల నిమిత్తం.... పరపురుషులకి లొంబడే భామల్ని వాడుకుంటూ ఉంటాడు.

హనుమాయమ్మ .... భర్తకి ఎన్నో విధాల నచ్చ జెప్పింది. హిత బోధ చేసింది. బతిమాలింది బామాలింది. కసిదీరా తిట్టింది జుట్టు పట్టి పీకింది. ఏడ్చింది.... మొత్తుకుంది! వాటన్నిటికీ సీతయ్య ఒకటే సమాధానం చెప్పాడు. "ఒసే హనుమా! నీ వయస్సు నలభై ఆరు... నా వయస్సు యాభై అయిదు నేనింకా బతికితే పదేళ్ళు బతుకుతానేమో. నీకా.. . ? ఆ ధ్యాసే లేకుండా పోయింది. నాకా? ఆ యావ ఎక్కువగా ఉంది! ఏం చెయ్యమంటావు చెప్పు? పదెకరాల పొలం మీద వచ్చే అయివేజు లింగు లిటుకూ మంటూ ఉన్న మనిద్దరం ఏం చేసుకుంటాం చెప్పు? అందుకని. .. మందుని... మగువని పరిపూర్ణంగా అనుభవించి చచ్చి పోదామని నిర్ణయించుకున్నాను. నువ్వు అరిచి గీపెట్టినా... నా పద్ధతి మారదు. నువ్వు నాకు అడ్డం పడకుండా ఉంటే.... రోజూ మందుకు ఓ పాతిక రూపాయలు.... రెండు రోజుల కోసారి పరాయి ఆడదాని సుఖానికి యాభై రూపాయలు చాలు. లేదా? నీ బంగారు నగలు.... దాచుకున్న డబ్బు వగైరాలు... ఒక్కొక్కటి వరస వరసగా సరదాగా మాయమయి పోతాయ్! నీకు ఏది బాగుంటుందో నువ్వే నిర్ణయించుకో!"

హతాశురాలయి పోయింది హనుమాయమ్మ. ఆఖరి అస్త్రంగా.... "అబ్బాయిని రానీండి. మీకు బాగా గడ్డి పెట్టించి .... బుద్ధి చెప్పిస్తాను" అంది..... గొంతు పూడుకు పోగా.

"హె! హెహె!" అంటూ వెటకారంగా నవ్వాడు. సీతయ్య "ఏమిటా కొంకరింపు?" అంది హనుమాయమ్మ..... కోపంగా.

"వాడుండేదే .... అమెరికాలో! అక్కడ పరిస్థితి ఏమిటో తెలుసా నీకు?" అన్నాడు సీతయ్య.

"తమరే శెలవివ్వండి" అన్నట్టుగా ఎత్తి పొడుపుగా చూసింది.

"అక్కడ ... ఏ మగాడికీ ఒక్క పెళ్ళాం మాత్రమే ఉండదు. దేనితో కావాలంటే ... దానితో పోవచ్చు. ఇక్కడలా... భయపడుతూ... భయపడుతూ... చాటుమాటుగా చావక్కరలేదు. పబ్లిగ్గా... తనకు నచ్చిన ఆడదాన్ని ముద్దు పెట్టుకోవచ్చు... తనకు కావలసిన చోటుకి తీసుకు వెళ్ళి బులపాటం తీర్చుకోవచ్చు! చెవులు కొరుక్కోటాలు, అల్లరి పెట్టటాలు పోలీసు కేసులు పెట్టించటాలు ఉండవ్. ఇక మందంటావా? దాని సంగతి చెప్పనే అక్కరలేదు. భేషుగ్గా ... అంతా సీమ సరుకేగా! దొరకేది? నీకు తెలుసో తెలియదో... మంచినీళ్ళు తాగినట్టుగా మందు తాగుతారట అమెరికాలో.

ఇంతకీ ఇదంతా ఎందుకు చెపుతున్నావు?" అంది ఈసడింపుగా.

"అలాంటి అమెరికాలో ఉన్న నీ సుపుత్రుడు .. ఇంకా పవిత్రంగా ఉన్నాడనుకున్నావా పిచ్చి మొహమా? ఇక నీ చచ్చు పుచ్చు సలహాలు మానేసి ... నా విషయంలో చూసి చూడనట్టుగా పోతూ ఉండు" అన్నాడు అదోలా నవ్వుతూ.

భర్త అలా అనేసరికి లేనిపోని దిగులు పట్టుకుంది హనుమాయమ్మకి. మొగుడెటు తిరిగీ చెడిపోయాడు. కొడుకు కూడా అమెరికా వెళ్ళి పాడయిపోయి ఉంటాడా? ఆమె మనసు మొద్దుబారిపోయింది. కొన్నాళ్ళు. ఆలోచించి... ఆలోచించి ... మానసికమైన వ్యధ అనుభవించి ... చివరకు గుండె దిటవు చేసుకొని 'వచ్చినప్పుడు ... ఎలాగోలా అడిగి తెలుసుకోవచ్చులే!' అనుకుంది. మళ్ళీ తన ఆలోచనకు తనలో తనే నవ్వుకుంది. తన పిచ్చిగానీ. "అబ్బాయ్! నువ్వు తాగుతావటగా? చెడిపోయావటగా?" అని తను ముఖాన అడగగలదా? ఒకవేళ అడిగినా... వాడు తన తప్పుల్ని ఒప్పుకుంటాడా? అంతే! ఆపైన తన ఆలోచనలకి స్వస్తి చెప్పింది హనుమాయమ్మ.

అబ్బాయొచ్చే రోజూ రానే వచ్చింది. వాకిట్లో కారు ఆగగానే... పుత్రోత్సాహంతో బయటికి పరుగెత్తు కొచ్చింది. హనుమాయమ్మ భార్య బలవంతం మీద... మందు గ్లాసు దాచేసి... తనూ వీధి వాకిట్లోకి వచ్చాడు సీతయ్య.

పనిమనిషి పళ్ళెం అందించగా కొడుక్కి దిష్టి తీసి హారతి పట్టి .. కొబ్బరి కాయ నేల మీద కొట్టి పారేసి – "రా నాన్నా! లోపలికి! అన్నట్టు ... కోడలేది?" అంది హనుమాయమ్మ.

"రావటానికి కుదరలేదమ్మా? అందుకని నేనొక్కడినే వచ్చాను. నువ్వూ నాన్నా బాగున్నారా?" అన్నాడు శేఖర్. తలూపింది హనుమాయమ్మ. ఆరేళ్ళ తరవాత కొడుకుని చూసిన ఆనందంలో మాట రావటం లేదామెకి. కాస్త వళ్ళు చేశాడు. చక్కగా కంటికి నిండుగా ఉన్నాడు... అనుకొని సంతృప్తిపడిందా తల్లి మనసు!

"మాకేమిటోయ్...? నిక్షేపరాయుడి కుప్పల్లా ఉన్నాం... ఇద్దరమూను! నువ్వు ... కోడలు.. ఆమె మేనమామ – అంతా బాగున్నారా?" కుశల ప్రశ్నలు వేశాడు సీతయ్య.

"ఓ. కే" అంటూ ... టాక్సీకి డబ్బులిచ్చి పంపేశాడు శేఖర్. నౌకర్లు లగేజి లోపలికి తీసుకొచ్చారు.

లోపలికి వెళ్ళి ... క్షణాల్లో... గ్లాసు నిండా చిక్కటి కాఫీ కలుపు కొచ్చింది హనుమాయమ్మ.

కాళ్ళు కడుక్కొచ్చిన శేఖర్... ఆయిష్టంగా చూసి "మరిచిపోయావా అమ్మా...? నాకు కాఫీ అలవాటు లేదని. అక్కడ కూడా కాలేదమ్మా" అన్నాడు నవ్వుతూ.

"నా మతిమండ! అవును కదూ! ఉండు ... పాలు పట్టుకొస్తాను" అంటూ లోపలికి వెడుతూ... భర్తకేసి కనుకొలకుల్లో సగర్వంగా చూసింది హనుమాయమ్మ.

'ఇల్లలకగానే పండగయి పోయిందని మురిసిపోకు. వీడు కాఫీ మానేసి 'విస్కీ' సేవిస్తూ ఉండి ఉంటాడనుకున్న సీతయ్య నిర్లక్ష్యంగా తలెగరేసి భార్యని చూసి – ఆమె వెళ్ళిపోయాక అన్నాడు... కుర్చీలో కూర్చున్న కొడుకుతో "అవునోయ్! అమెరికాలో కాఫీ తాగకపోతే నలుగురూ నవ్వరా?"

అందులోని నర్మగర్భితమైన భావం అర్థం కాలేదు శేఖర్‌కి. "ఎందుకు నవ్వుతారు నాన్నా? అసలక్కడ ఇలాంటివి పట్టించుకోటానికి టైమే ఉండదు. అంతా స్పీడు జీవితం" అన్నాడు మామూలుగా. దెబ్బ తిన్నట్టయిపోయింది సీతయ్య పరిస్థితి.

పాలు గ్లాసుతో తీసుకొచ్చింది హనుమాయమ్మ. శేఖర్ తాగుతుంటే... ఆప్యాయంగా అతనికేసి చూస్తూ ఉండిపోయింది. తన కడుపు పంట ... తన నోముల ఫలం..! ఎంతగా ఎదిగిపోయాడు! ఎంత పెద్దవాడయి పోయాడు? ఆమె మాతృ హృదయం ఆర్ద్రమైంది.

గ్లాసు కింద పెట్టేశాడు శేఖర్. ఓ పది నిముషాలు... గుట్టలు గుట్టలు కబుర్లు దొర్లాయి ముగ్గురి మధ్య.

అమెరికాలో ఉన్న తెలుగువారి జీవన సరళి... ఇక్కడికీ... అమెరికాకీ ఉన్న తేడా అంతా వివరించి చెప్పాడు... శేఖర్.

"మన ఊరు బాగుందంటావా? అమెరికా బాగుందంటావా?" తెలివిగా ప్రశ్నించాననుకున్నాడు సీతయ్య... మీసం మెలి పెడుతున్నట్టు భార్య కేసి చూస్తూ.

కొడుకేం జవాబు చెపుతాడోనని ఆదుర్దా పడిపోతోంది హనుమాయమ్మ.

"నాన్నా పనస తొనలు ఎలా ఉంటయ్?" ఎదురు ప్రశ్న వేశాడు శేఖర్.

"మధురంగా ఉంటయ్ "

"మరి తేనె?"

"అదీ మధురంగా ఉంటుంది."

"పనస తొనలు మధురంగా ఉంటయ్యా... తేనె మధురంగా ఉంటుందా...? అంటే ఏం జవాబు చెపుతావు నాన్నా?"

బుర్ర గోక్కున్నాడు సీతయ్య.

ఫక్కుమంది హనుమాయమ్మ – విజయగర్వంతో.

"జన్మభూమి... మరపురానిది ... అమెరికా మరువలేనిది. రెంటినీ పోల్చి చూడటం అనవసరం నాన్నా!" అన్నాడు శేఖర్.



తలూపక తప్ప లేదు సీతయ్యకి.

"నువ్వు బట్టలు మార్చుకుని స్నానం చేసి... కాసేపు విశ్రాంతి తీసుకో... అరగంటలో నీకు కమ్మని భోజనం పెడతాను" అంది హనుమాయమ్మ.

"అలాగేమ్మా" అంటూ లేచాడు శేఖర్.

కమ్మని నెయ్యి... గడ్డ పెరుగు... తాజా కూరలు... నవులూరించే సాంబారు... రసాలతో.. తృప్తిగా శేఖర్ భోం చేస్తుంటే ... తన కడుపే నిండిపోయినట్టుగా సంబరపడిపోయింది హనుమాయమ్మ.

తండ్రి వెంట వెళ్ళి పొలాలు చూసి వచ్చాడు శేఖర్.

తన బండారం ఎక్కడ బయట పడి పోతుందో అని పట్టి బలవంతాన ఊరుకున్నాడు గానీ.. మూడు రోజులయ్యేసరికి ఉండలేకపోయాడు సీతయ్య. మందు లేక నాలుక పిడచ గట్టుకుపోతోంది. మగువ పొందు కోసం శరీరం తహతహలాడిపోతోంది.

అయితే దానికో చక్కని పథకం మాత్రం వేశాడు.

"ఒరేయ్ శేకూ! ఇవ్వాళ సాయంత్రం నాలుగింటికి బయలుదేరి మన పొలం వెడదాం ఈ రాత్రికి అక్కడే బస. పొద్దున్న తిరిగి వద్దాం" అన్నాడు హనుమాయమ్మ లోపలెక్కడో పనిలో ఉన్న సమయం చూసి.

"ఎందుకు నాన్నా?" అన్నాడు శేఖర్.

"విశేషముంది. తరవాత చెపుతాగా?" అన్నాడు లో గొంతుకతో.

తనకీ పిక్‌నిక్ కాంపులా ఉంటుందనుకున్న శేఖర్ "సరే!" నన్నాడు యధాలాపంగా.

పెరట్లోకి వచ్చిన తరవాత భార్యతో గుసగుసగా అన్నాడు సీతయ్య "ఏమే మహా ఇల్లాలా? కొంపదీసి నా ఘనకార్యాల సంగతి.... మన శేఖర్ గాడి చెవిన గాని వేసేశావా? నేను స్నానానికి... వాటికి వెళ్ళినప్పుడు..." అన్నాడు.

"ఊరుకోండి! మీరు మరీను... ఏ భార్యయినా తన కొడుకు ముందు... తన భర్తని కించపరుచుకుంటుందా? అది తనకి మాత్రం ఏం గౌరవం? పైగా మీరీ మూడు రోజుల్నుంచీ బుద్ధిమంతుడిలా మసలుతున్నారు గదా!" అంది

కొడుకా! నువ్వా చెడిపో!

భర్తతో... మెచ్చుకోలుగా.

"అదీ! భార్యంటే అలా ఉండాలి! ఆ! ఇంతకీ మన వాడి గురించి నీ అభిప్రాయమేమిటంటావ్? ఇదివరకటి లాగానే ఉన్నాడా.... ఏమన్నా మారాడంటావా?" అన్నాడు కుతూహలంగా.

"నాకేం మారినట్టు కనుపించటం లేదు... ఇదివరకటి కన్నా నిదానం ఎక్కువయినట్టు కనుపిస్తోంది. అబ్బాయిని చూడటానికి వచ్చిన ఇరుగు పొరుగు మగవాళ్ళు ... ఆడవాళ్ళు ... వాడ్ని ఎంతగానో మెచ్చుకున్నారు. తరవాత నీకేమమ్మా! బంగారం లాంటి డాక్టర్ బాబుని కొడుకుగా కన్నావు అని" అంది హనుమాయమ్మ – సంతోషంగా.

తేలిగ్గా కొట్టేశాడు సీతయ్య. "మెరిసేదంతా బంగారం అనుకుంటే ఎలాగే భార్యారత్నమా?"

"అంటే మీ ఉద్దేశమేమిటి?" చివ్వున కోపం వచ్చింది హనుమాయమ్మకు.

"చెపుతాగా? కొంచెం ఆగు" అన్నాడు సీతయ్య. అదోలా నవ్వుతూ.

"ఏమిటో? మీ మాటలు నాకేమీ అర్థం కావటం లేదు. కొడుకు చెడిపోకుండా ఉండాలని ప్రతి తండ్రీ కోరుకుంటాడు. మీరేమిటి... ఇలా మాట్లాడుతున్నారు? శుభం పలకరా పంతులూ! అంటే... పెళ్ళి కూతురు ముండేదన్నట్టుగా..." ఈసడింపుగా అంది హనుమాయమ్మ.

ఏమనుకున్నాడో ఏమో ... సీతయ్య ఆ విషయాన్ని పొడిగించకుండా.. "నేనూ అబ్బాయి... సాయంత్రం మన పొలాల కేసి వెడతాం" అన్నాడు.

"వెళ్ళి రండి! దాంట్లో విశేషమేముంది?" అంది హనుమాయమ్మ... మామూలుగా.

సీతయ్య పథకం ఆమెకి తెలియదుగా మరి!

కాఫీ టిఫిన్లు అయిన తరవాత కొడుకుని తీసుకుని బయలుదేరాడు సీతయ్య.

హనుమాయమ్మ చాలా సంతోషపడ్డది. అబ్బాయి రాకతో తన భర్తలో కూడా కొంత మార్పు వచ్చినందుకు ఆమెకెంతో ఆనందంగా ఉంది. "అబ్బాయి తిరిగి వెళ్ళిన తరవాత కూడా... ఈయని లాగే ఉండేట్టు చెయ్యి భగవంతుడా!" అని వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంది.

చేలగట్టు మీద నడుస్తున్నారు తండ్రీ కొడుకులు. పచ్చని పొలాలు... పచ్చని చెట్లు... ప్రకృతి కన్య... పచ్చని చీర జాకెట్టు ధరించి విలాసంగా తన విహారం చేస్తున్నట్టుంది. వినీలాకాశంలో తెల్లటి మబ్బులు వింత సొయగాన్నీతున్నాయి. మెల్ల మెల్లగా ... చేల మీద నుంచి వీచే చల్లగాలి వంటికి హాయిగా తగులోంది. సూర్యుడు పశ్చిమాద్రికి చేరుకోటానికి త్వరపడుతున్నాడు.

"అబ్బాయ్! ఎలా ఉన్నయ్ మన పొలాలు?" అన్నాడు సీతయ్య.

"చాలా బాగున్నయ్ నాన్నా! అణువణువునా నువ్వు . తీసుకొంటున్న శ్రద్ధ ప్రత్యేకంగా కనుపిస్తోంది. ఎకరానికి పాతిక బస్తాల పైనే అవ్వచ్చునుకుంటాను."

బాణం దెబ్బ తిన్నట్టు విలవిలలాడిపోయాడు సీతయ్య. ఏనాడన్నా పొలం పనులమీద తను శ్రద్ధ చూపిస్తేగా? వెంటనే తేరుకుని..." అవును! అవును..."అన్నాడు తడబడుతూ.

ఇంకో ఫర్లాంగు నడిచేంత వరకూ తండ్రీ కొడుకుల మధ్య మౌనం రాజ్యమేలింది.

"ఇదేమిటి నాన్నా?" అన్నాడు శేఖర్... అక్కడ ప్రత్యేకంగా ఉన్న చుట్టిల్లును చూసి.

"ఒక్కోసారి... పొలం పనులు ముమ్మరంగా ఉన్నప్పుడు... పాలేళ్ళతో పాటు రాత్రి వూట కూడా ఇక్కడే ఉండాల్సి వస్తుంది. అలాంటప్పుడు ఉండటానికి పనికి వచ్చే విశ్రాంతి గృహం లాంటిది."

"ఓహో!" అన్నట్టుగా తలూపాడు శేఖర్. పక్కనున్న పాలేరు పాకని కూడా చూస్తూ...

"రండయ్యగోరూ! రండి అబ్బాయి గోరూ!" అంటూ స్వాగతం పలికాడు ఒక పాలేరు... పాక తలుపులు తీస్తూ...

"బాగున్నావా పోలయ్యా!" అంటూ పలకరించాడు శేఖర్.

"బాగుండానండి" అన్నాడు పోలయ్య. ఆ పాకలో... రెండు కుర్చీలు... ఒక మంచం... ఒక కూజా... బల్ల ... లాంటి కనీస సౌకర్యాలన్నీ అమర్చబడి ఉన్నయ్.

తండ్రీకొడుకు లిరువురూ చెరో కుర్చీలో కూర్చున్నారు.

క్షణాల్లో ... గట్టు మీదున్న కొబ్బరి చెట్టెక్కి బొండాలు తీసి... గ్లాసుల్లో కొబ్బరినీళ్ళు పట్టుకొచ్చాడు పోలయ్య.

"అబ్బ! ఎంత తియ్యగా ఉన్నాయో?" అన్నాడు శేఖర్ తాగిన తరవాత.

"ఇక్కడ వాతావరణమే అలా ఉంటుందిరా" అన్నాడు సీతయ్య. దాని అర్థం అతనొక్కడికి మాత్రమే తెలుసు!

"పోలయ్యా! కోడి వేపుడు... చేపల పులుసుతో చక్కగా వంట చేయించు" ఆజ్ఞాపించాడు సీతయ్య.

"అట్టాగేనండి" అంటూ వెళ్ళబోయాడు –



పోలయ్య

"అదెక్కడ?" అన్నాడు సీతయ్య

ఆశ్చర్యంగా చూశాడు శేఖర్

మరుక్షణంలో పరుపు కింద నుంచి పేక పాకెట్ను తీసి ఇచ్చాడు పోలయ్య

"ఎందుకునాన్నా?" అన్నాడు శేఖర్ అమాయకంగా

"ఎందుకేమిటిరా? ఆడుకోటానికి! నవ్వుతూ అన్నాడు సీతయ్య

ఎవరెవరు?"

"భలేగా ఉందిరా అబ్బాయ్! నువ్వు నేనూ

"నీకు తెలుసుగా నాన్నా నాకు పేకాడటం రాదని" ఇబ్బందిగా ఫీలయ్యాడు శేఖర్

"అబ్బాయ్ నీకో రహస్యం చెప్పనా?"

కనుబొమ ఎగురేశాడు శేఖర్ ప్రశ్నార్థకంగా.

"చెట్టంత కొడుకుని స్నేహితునిలా చూడమన్నారు పెద్దలు. దాన్ని నేను నీ విషయంలో పూర్తిగా ఆచరిస్తాను అందుకని . ఇప్పుడు . ఇక్కడ నువ్వేమీ సంకోచించాల్సిన పనిలేదు. రా! ముందుగా మన కార్యక్రమాన్ని పేకాటతో ప్రారంభిద్దాం! రా!" మనస్ఫూర్తిగా ఆహ్వానించాడు సీతయ్య

"నీ మంచి మనసు నాకు తెలుసునాన్నా ... కానీ పేకాట మీద నాకు మనసు లేనే లేదు . పొలం ... వ్యవసాయం. అందులోని సాధక బాధకాలు చెప్పు . వింటాను అమెరికాలోని సేద్యానికి అన్వయించి కొన్ని కొత్త విషయాలు చెపుతాను" అన్నాడు శేఖర్

గుండెల్లో రాయి పడింది సీతయ్యకి తనకు తెలిసేదున్నట్టుగా కొడుక్కు చెప్పటానికి? అనుకున్నాడు దాన్ని కప్పి పుచ్చుకోటానికి ఒక కొత్త ఎత్తుగడ వేశాడు

పోలయ్యా?" అంటూ కేకేశాడు.

"అయ్యా! అంటూ వచ్చాడు పోలయ్య.

'వచ్చేప్పుడు మరిచిపోయాను మీ దొరసానమ్మ కంగారు పడుతుందో ఏమో ఈ రాత్రికి అయ్యగారు అబ్బాయిగారు ఇక్కడే ఉంటారంట భోజనాలు కూడా ఇక్కడే నంటని చెప్పిరా' అని పురమాయించాడు

'సరేనయ్యా!"అంటూ వెళ్లాడు పోలయ్య అతను వెళ్ళిన అయిదు నిమిషాలకు "ఒరే శేకూ! నువ్విక్కడే కూర్చో . నేనలా బహిర్భూమికి వెళ్ళి వచ్చేస్తాను" అంటూ లేచాడు సీతయ్య అప్రయత్నంగా ఆయన చెయ్యి మీసం మీదికి వెళ్ళింది సగర్వంగా

"సరే నాన్నా అన్నాడు శేఖర్.

తండ్రి వెళ్ళిన తరువాత కుర్చీమీద నుంచి మంచం మీదపడుకొని రిలాక్సయ్యాడు. అమెరికాలోని ఫాస్ట్ లైఫ్‌కు .. ఈ పల్లెలోని ప్రశాంత జీవితానికి బేరీజు వేసుకుంటున్నాడు మనసులో.

పట్టుమని పది నిముషాలు కూడా కాలేదు. గాజుల చప్పుడు వినిపించింది.

ఆశ్చర్యపోయి ఆ శబ్దం వచ్చిన వైపు చూశాడు శేఖర్

గాజుల చప్పుడు ఆగిపోయింది.

ఉలిక్కిపడి లేచాడు శేఖర్.

ఛటుక్కున లోపలి కడుగుపెట్టిందా శాల్తీ!

కంగారు పడుతూనే పరిశీలనగా చూశాడు

ఇరవై . పాతిక సంవత్సరాలున్న స్త్రీమూర్తి చామన ఛాయగా ఉన్నా ఆకర్షణీయమయిన ముఖం చక్కటి కనుముక్కు తీరు, ఎత్తుగ ఎగసిపడుతూ మత్తెక్కించే యవ్వన సంపద చవులూరించే వంపు సొంపులు

ఆమె చేతిలో ఉన్న దాన్ని చూసి మరోసారి ఆశ్చర్యపోయాడు బ్రాంది బాటిల్!

"ఎవరు నువ్వు?' అన్నాడు శేఖర్

"నిజంగానే మీకు తెలియదా? అబ్బాయిగోరూ?"

"తెలియదు బయటికెళ్ళు ముందు" తనకు తెలియకుండానే గద్దించాడు

ఆమె అంగుళం కూడా కదలలేదు

"నీకే చెప్పేది?"

"నేను లోపలికి వచ్చింది . ఎల్లటానిక్కాదు బాబుగోరూ" అంది బ్రాంది బాటిలు ... బల్లమీద పెడుతూ

మళ్ళీ ఆమే అంది. "మీ నాన్నగోరు సూత్తారని భయమా? నేను మీతో ఉన్నంత వరకు ఎవురు రారిక్కడికి.'

"ముందు బయటికి వెడతావా వెళ్ళవా?" రెట్టించాడు

'ఏం దబ్బాయిగోరూ! నాలాంటి పంచదార

ఈ·వేమన·పద్యాలు

మర్మ మెఱుగలేక మతముల గల్పించి
యుర్విదిశలు గూర్తు రొకరి కొకరు
గాజు ఇంట గుక్క కళవళపడ్డట్టు
విశ్వదాభిరామ వినురవేమ.

లడ్డూని తింటానికి ఇంతసేపు ఆలోచిస్తున్నారు. ఇంకోల్లయితేనా ఈపాటికి ఎగిరి దూకేవోలు! బేగి రండి! ముందు ఈ మందు రుసి సూడండి ...!" అంటూ బ్రాందీ సీసా మూత తీసి ... గ్లాసులో కొంచెం పోసి ... దాంట్లోకి కూజాలోని నీళ్ళు వంపింది.

"తాగండబ్బాయి గోరూ! మజాగుంటది!" కవ్విస్తూ అతని చేతికిచ్చింది గ్లాసుని.

అంతే!

మరుక్షణంలో గ్లాసుని నేలకేసి కొట్టాడు శేఖర్.

నివ్వెరపోయిందామె.

"ఓహో! అబ్బాయిగోరికి మందక్కర లేదన్నమాట! అట్టాగా ... మీకేం కావాలో ఇత్తానుండండి" అంటూ అమాంతం శేఖర్‌ని కౌగలించుకుని మంచం వేపుకి లాక్కెళ్ళటానికి ప్రయత్నించింది.

"ఛీ! వదులుతావా వదలవా?"

కొడుకా! నువ్వా చెడిపో!

"వదల్ట మేమిటబ్బాయిగోరూ! మజా సేసుకోండి నాతో" అంది తన కౌగిలి నింకా బిగిస్తూ.

"ఆఖరుసారిగా చెపుతున్నాను. మర్యాదగా వదులుతావా? వదలవా?" గర్జించాడు శేఖర్.

"మీ మగాళ్ళంతా ఇంతేలెండి! ముందిట్టాగే బెట్టు సేసినట్టు కనిపిత్తారు" అతన్ని మరింత గట్టిగా హత్తుకుంటోందామె.

బలాన్నంతా కూడదీసుకుని విదిలించి కొట్టాడామెని శేఖర్. ఆ ఊపుకి అతని కౌగిలి నుంచి విడివడి ... పడిపోబోయి - నిలదొక్కుకుందామె. తరవాత ... తలదించుకొని ...

"నిజంగా మీకిష్టంలేదా అబ్బాయిగోరూ?" అంది దెబ్బ తిన్నట్టుగా.

"లేదు" నిష్కర్షగా చెప్పాడు శేఖర్.

ఆమె మారు మాట్లాడకుండా అమాంతం శేఖర్ కాళ్ళ మీద పడిపోయింది.

"తప్పు! ఏమిటిది? లే!" అన్నాడు.

లేస్తూనే అందామె "క్షమించండి. నేను పోలయ్య పెళ్ళాన్ని! ఇదంతా సేయించింది మీ నాన్నగోరే! ఇంత నీతిమంతులు ఆయన కడుపునెట్టా పుట్టారు బాబుగోరూ? వత్తాను" అంటూ వెళ్ళిపోయింది.

నిర్ఘాంతపోయాడు శేఖర్. ఎవరో తనని పాతాళానికి అణగదొక్కినట్టుగా ఉందతనికి. కన్న కొడుక్కి ... తండ్రి స్వయంగా పూనుకుని ... మందుని ... మరో మగువని ఏర్పాటు చేయటమా? చాలా కొత్తగా... అంతకన్నా వింతగా ఉందతనికి.

రివ్వున చుట్టింటి బయటికి వచ్చి ... "నాన్నా నాన్నా" అంటూ కేకేశాడు గట్టిగా.

"పాక కంతల్లోంచి సూసి ... మొకం సెల్లక యింటికెళ్ళిపోయారు బాబుగోరూ" తన పాకలోంచి జవాబిచ్చిందామె.

మళ్ళీ ఆశ్చర్య పోయిన శేఖర్ ... "ఇదిగో! ఆ వంటలేమి చెయ్యకు. నేను వెళ్ళిపోతున్నాను" అంటూ ముందుకు నడిచాడు. అతని మనసంతా గజిబిజిగా ఉంది.

తన శీలానికి పరీక్ష ఎందుకు పెట్టాడు నాన్న? అదే అర్థం కావటం లేదతనికి.

ఇంటికి చేరేసరికి ... సన్నగా నాన్న ఏడుపు స్వరం ... వినిపించి కాళ్ళకు మేకులు కొట్టినట్టుగా అక్కడే ఆగిపోయాడు.

"నువ్వే గెలిచావ్ హనుమా! అమెరికాలో ఉంటున్న మనబ్బాయికి ... తాగుడు ...జూదం ... వ్యభిచారం, అన్నీ అలవాటయి ఉంటయ్యనుకొని ... మన పాలానికి తీసుకెళ్ళి ... వాడికి తెలియకుండా పోలయ్య పెళ్ళాన్ని చుట్టింట్లోకి పంపించాను ... మందు సీసాతో ... అబ్బాయి దాన్ని ఛీకొట్టి బయటకు గెంటేసాడు. పాక వెనకాల నిలబడి కంతల్లోంచి తొంగి చూస్తున్నాను నేను ... సిగ్గుతో చచ్చి పోయాను హనుమా! నా కొడుకులో మరో శ్రీరాముణ్ణి చూశాను. ఇంత వయస్సు వచ్చి గోపి లోలుడి వేషాలు వేస్తున్న నన్ను ... అబ్బాయి మంచిప్రవర్తన ... మెత్తని చెప్పుతో కొట్టినట్టయింది. నాలో పరివర్తన తీసుకు రాగలిగింది. నీకు హామీ ఇస్తున్నాను హనుమా. ఈ రోజు నుంచీ నేను మందు కొట్టను. పరాయి ఆడదాన్ని ముట్టను. ఇన్నాళ్ళు నీ మనసు బాధ పెట్టినందుకు నన్ను క్షమించు."

"అలా అనకండి. ఇప్పుడు నాకెంత సంతోషంగా ఉందో తెలుసా? సీమ వెళ్ళిన కొడుకు నీతిమంతుడని రుజువు చేసుకోవటమే కాకుండా ... ఈ పల్లిసీమకొచ్చి .. తండ్రిని కూడా మార్చి వెయ్యగలిగాడు ఇంతకన్నా ఏం కావాలండీ నాకు." అంది హనుమాయమ్మ.

తల్లిదండ్రుల మాటలు విన్న శేఖర్‌కి ... అమెరికానుంచి ... కేవలం వాళ్ళని చూద్దామని వేలు వేలు ఖర్చు పెట్టుకొని వచ్చిన తన ట్రిప్ సార్థకమయిందనిపించి ... ఆనందంతో కళ్ళు చెమ్మగిల్లాయి. □